ప్రజాశక్తి
శనివారం 5 ఆగస్టు 2023
5
అల్లూరి సీతారామరాజు



తప్పని డోలీ మోత

- గర్భిణిని ఐదు కిలోమీటర్లు తరలింపు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతి ఉబ్బెంగుల నుండి సుత్తిగుడ జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణం చేయాలని లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర.త్రినాధ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా త్రినాధ్ మాట్లాడుతూ, గురువారం రాత్రి 2 గంటల సమయంలో వంతల బసంతి (19)కు పురుటి నొప్పులు రావడంతో శుక్రవారం ఉదయం 6 గంటలకు సమయంలో ఉబ్బేంగుల నుండి సుత్తిగుడా వరకు డోలి సహాయంతో గ్రామ వాలంటరీ వంతల సుబ్బారావు, వంతల గురుమూర్తి, కుటుంబసభ్యులు 5 కిలో మీటర్లు దూరం మోసుకోచ్చారన్నారు. అంబులెన్స్ సహాయంతో ముంచంగిపుట్టు సిహెచ్‌సి ఆసుపత్రికి తరలించారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి రోడ్డు మంజూరు చేయాలని కోరారు.



డోలీలో తరలిస్తున్న కుటుంబీకులు

మన్యంలో జోరుగా సాగు పనులు



దుక్కి దున్నుతున్న రైతులు



ఏపుగా పెరిగిన పంట

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలో వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండటంతో సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. గిరిజనులు ఇప్పటికే వేసిన చిరుధాన్యాలు, వేరుశనగ, పసుపు, జొన్న పంటలు ఏపుగా పెరుగుతున్నాయి. మన్యంలో వర్షాలు పడుతుండడంతో రైతులు నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. ఏజెన్సీలో ప్రత్యేకంగా సాగునీటి వసతులు లేక పోవడంతో పంటలన్నీ వర్షాధారంగానే సాగు చేస్తుంటారు. దీంతో, వర్షాలు పడే జూన్ నుంచి సెప్టెంబర్ వరకు గిరిజన రైతులకు కీలకం. వరి, చోడి సామ, మొక్కజొన్న, వేరుశనగ, పసుపు, అల్లం పంటలు ప్రధానమైనవి. ఏడాదిలో సాగయ్యే పంటల్లో 90 శాతం ఖరీఫ్ లోనే ఉంటుంది. కుటుంబ యావత్తూ వ్యవసాయ పనుల్లో పాలు పంచుకుంటారు.

ఆశాజనకంగా పనులు

ఈ ఏడాది సకాలంలోనే వర్షాలు పడుతుండటంతో ఖరీఫ్ పనులు ఎప్పటికప్పుడు చేస్తున్నాం. వర్షాలు బాగా పడడంతో వరి నారు, దమ్ములు, నాట్లు పనులు ఆశాజనకంగా సాగుతున్నాయి. ప్రస్తుతం మా పొలాల్లో ఇప్పటికి దమ్ములు పూర్తయ్యాయి. రానున్న వారం రోజులు వర్షాలు కురిస్తే మెరక ప్రాంతంలో కూడా వారి నాట్లు పూర్తవుతాయి. ఆయా గ్రామాల్లో గిరిజన కుటుంబాలు ఖరీఫ్ పనుల్లో ముమ్మరంగా చేపడుతున్నారు. దీంతో, గ్రామాలు సందడిగా మారాయి.

ఒ.క్రిస్టియన్ దాసు
గూడ గ్రామం, హుకుంపేట మండలం

70 శాతం నాట్లు పూర్తి

గత ఏడాదిలో పోలిస్తే ఈ ఏడాది వర్షాలు బాగానే కురుస్తున్నాయి. ఆశాజనకంగా పడుతుండడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. గత ఏడాది ఈ సమయానికి సగం వరి నాట్లు పడింది. ఈ ఏడాది 70శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. మా ప్రాంతంలో జోరుగా సాగు పంటలు జరుగుతున్నాయి. వర్షాలు కురవడంతో పంటలు బాగా పండే అవకాశం ఉంది.

కె.మత్స్యరాజు
చింతల విధి పాడేరు మండలం

నులిపురుగులను నిర్మూలించాలి

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 10వ తేదీన జిల్లా వ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యాక్రమాలు పక్కాగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ.పి ఓ వి. అభిషేక్ స్పష్టం చేసారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై రూపొందించిన కరపత్రాలు, గోడ పత్రికలను శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ, నులి పురుగుల నిర్మూలనపై ప్రజలను చైతన్యవంతం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నులిపరుగులతో పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడతారని చెప్పారు. 1 నుండి 5 ఏళ్ల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలలోను, 6 నుండి 19 ఏళ్ల పిల్లలకు కిషోర బాలికలకు పాఠశాలలు, కళాశాలలో నులిపురుగుల నివారణ బిళ్లలు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి.అంబేద్కర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.వి.ఎస్. శర్మ, ఐసిడి ఎస్‌పిడి సూర్యలక్ష్మి, ఐటిడిఏ పరిపాలనాధికారి హేమలత, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసు, ఐటిడిఏ.పి ఓ అభిషేక్



జెండా ఊపుతున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా నాయకులు సత్యనారాయణ

ఢిల్లీలో ధర్నాకు బయలుదేరిన పోలవరం నిర్వాసితులు

ప్రజాశక్తి- విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ధర్నాకు విఆర్.పురం మండలం నుండి నిర్వాసితులు శుక్రవారం బయలుదేరారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక రేఖపల్లి సెంటర్‌లో ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు జాతీయ హోదా కలిగిన ప్రాజెక్టు కాబట్టి కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం మీద ఒత్తిడి తేవాలని, నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాకపోతే అందరిని ఐక్యం చేసి పోరాటాలు ఉధృతంగా చేస్తామని, నిర్వాసితుల కోసం ఎక్కడికైన వెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ కారం బుచ్చమ్మ, మండల నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, శిరపు తాతబాబు, పులి మురళి, నిర్వాసితులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన బాలికల కిడ్నాప్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి -మారేడుమిల్లి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ముగ్గురు బాలికలల కిడ్నాప్‌పై స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం రాత్రి ఫిర్యాదు అందినట్లు ఎస్సై రాము తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... మండలంలోని గుజ్జు మామిడి వలస గ్రామానికి చెందిన సురబోయిన సుబ్బలక్ష్మి కూతురు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ హాస్టల్లో ఉంటుంది. ఈ నెల 2వ తేదీన సుబ్బలక్ష్మి తన కూతురుని చూడడానికి వస్తే ఆమె హాస్టల్‌లో లేదు. దీంతో ఆమె కళాశాలలో విచారించగా అమె కుమార్తెతో పాటు అదే కళాశాలకు చెందిన మరో ఇద్దరు బాలికలు కనిపించకపోవడాన్ని గుర్తించారు. దీంతో చుట్టుపక్కల గ్రామాలు, వారి బందువుల ఇళ్లలో వెతకగా వారి ముగ్గురిని రంపచోడవరం మండలం కాకవాడ గ్రామానికి చెందిన కొమరం ఉమాభారతి అనే మహిళా ప్రలోభపెట్టి కిడ్నాప్ చేసిందని తెలుసుకున్నారు. దీంతో సుబ్బలక్ష్మి నిందితురాలు ఉమాభారతిపై మారేడుమిల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ధర్నా చేపడుతున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఈ ఏడాది బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతభత్యాల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన పాడేరులోని డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం మే నెలలో విద్యాశాఖలో చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు జూన్ 12న ముగియడంతో బదిలీ కాబడిన ఉపాధ్యాయులు పాఠశాలలు పున్ణ ప్రారంభమైన రోజు విధులలో చేరారని చెప్పారు. బదిలీలు జరిగి సుమారుగా రెండు నెలలు గడిచినా ఉపాధ్యాయులకు ప్రభుత్వం సకాలంలో జీత భత్యాలు చెల్లించడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ ఏడాది బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతభత్యాల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సి.హెచ్ నాగేశ్వరరావు, యం.ధర్మారావు, కె.రఘునాథ్, ఎస్.గంగాధర్, పి.లింగన్న, కె.రాజు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలు పట్టవా ?

రంపచోడవరం ఎమ్మెల్యేను నిలదీసిన ఆదివాసీలు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి

'గిరిజన సమస్యలు మీకు పట్టవా. గ్రామంలో ఏ సమస్యా పరిష్కారానికి నోచుకోవడం లేదు' అంటూ అధికార పార్టీకి చెందిన రంపచోడవరం నియోజకర్గ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మిని మండలంలోని లబ్బర్తి పంచాయతీ నెల్లిమెట్ల గ్రామస్తులు నిలదీశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లారు. వెంటనే గ్రామస్తులంతా గుమిగూడి తమ గ్రామంలో ప్రభుత్వ ఇళ్లు రాలేదని, రోడ్లు, డ్రెయిన్లు సక్రమంగా లేవని అన్నారు. తాగునీరూ, ఇతర సమస్యలూ నెలకొన్నాయని చెప్పారు. వాటిని పరిష్కరించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని అన్నారు. ఏజెన్సీలో జిఒ నెంబర్ 3 అమలు కావడం లేదని, గిరిజనుల హక్కులు, చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించకుండా ఇటువంటి పర్యటనలతో ఉపయోగమేముందని మండిపడ్డారు.



ఎమ్మెల్యే ధనలక్ష్మిని ప్రశ్నిస్తున్న నెల్లిమెట్ల గ్రామస్తులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రకాశక్తి-రాజవొమ్మంగి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని లబ్బర్తి పంచాయతీలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే ధనలక్ష్మి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, లాగరాయి, లబ్బర్తి సర్పంచులు మిరియాల గణలక్ష్మి, సత్యవతి, ఎంపీడీవో యాదగిరిశ్వరరావు, డిటి సత్యనారాయణ, ఎస్సై టీజీ నరేంద్ర ప్రసాద్, వైసీపీ నాయకులు బొడ్డు వెంకటరమణ, డి.వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

విద్యుత్ ఉద్యోగుల జెఎసి నాయకులు

ప్రజాశక్తి -సీలేరు

విద్యుత్ ఉద్యోగులు డిమాండ్లను ఏపీ జెన్కో యాజమాన్యం పరిష్కరించే వరకు దశల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు వై.సత్తిబాబు, వై.ధర్మరాజు స్పష్టం చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం నుంచి ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విధి నిర్వహణ (వర్క్ టు రూల్) పాటిస్తామన్నారు. పని వేళలు ముగిసిన తర్వాత విద్యుత్ సరఫరా అంతరాయం తదితర సమస్యలు ఉన్నా చేయడం జరగదని, పని వేళల్లో మాత్రమే వర్కు చేస్తామని స్పష్టం చేశారు. ఇది పూర్తిస్థాయి సమ్మెలోకి వెళ్లే ముందు చేసే సన్నాహక చర్య మాత్రమేనని, ప్రజలు, వినియోగదారులు తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. యాజమాన్యం మొండి వైఖరి అవలంభించి తమ డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్ర జేఏసీ నాయకులు ఆదేశాల మేరకు ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు.

బాధితులకు పరిహారం అందించడంలో విఫలం

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఎస్టీ కాలనీ, బిసి కాలనీ, నిమ్మలగూడెం వాసులకు వరద సహాయం అందించటంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని బిజెపి నాయకులు ఆరోపించారు. చింతూరు ఎస్టీ కాలనీ రచ్చబండ వద్ద వరద బాధితులతో బిజెపి నాయకులు మాట్లాడారు. తమకు ప్రభుత్వం నుండి ఎటువంటి వరద సహాయం అందలేదని బాధితులు తెలిపారు. 1000 ఇళ్లకు సహాయం అందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు టీవీఎస్.రెడ్డి, పాంగి రాజారావు, పాయం వెంకయ్య, సత్యనారాయణ రెడ్డి, ఉయిక బుల్లి కొండల్ దొర పాల్గొన్నారు.

పచ్చదనం పర్యావరణానికి దోహదం

ప్రజాశక్తి-సీలేరు

పచ్చదనం పర్యావరణానికి ఎంతో దోహదపడుతుందని సిఆర్పిఎఫ్ పార్టీ-2 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ వెల్లడించారు. జీకే వీధి మండలం సీలేరు రెగ్యులేటరీకి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా వివిధ రకాల మొక్కలు శుక్రవారం నాటారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ చెట్లు నాటడం వలన పచ్చదనం కలుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, వానపల్లి అప్పారావు, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు



బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్, నాయకులు

బీమా నగదు అందజేత

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తాడేపూట్టు పంచాయతీ నిమ్మలపాడు గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రేగం నారాయణ రాజు కుటుంబానికి వైఎస్ఆర్ భీమా పథకం కింద పది వేలు స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతి శుక్రవారం అందజేశారు. అనంతరం స్థానిక సర్పంచ్ సత్యవతి మాట్లాడుతూ, కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ధైర్యం తెచ్చుకొని పిల్లల భవిష్యత్తుకు మార్గదర్శిగా ఉండాలని ఆమె ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన భీమా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ సభ్యులు సోవెరి. కొండలరావు, వైఎస్ఆర్సిపి నాయకులు జన్ని అప్పారావు, లక్ష్మయ్య, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితుల తక్షణ సాయానికి ఆంక్షలా?

ప్రజాశక్తి-కూనవరం

వరద బాధితులకు తక్షణ సాయం కింద ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.2000 ఇవ్వడానికి కూడా పలు ఆంక్షలు పెట్టడం దుర్మార్గమని టిడిపి మండల అధ్యక్షులు బరపాటి ప్రకాశరావు అన్నారు. దీని వల్ల అర్హులైన ప్రజలకు చాలా మందికి వరద సాయం అందడం లేదన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అర్హులందరికీ వరద సాయం అందకపోవడంపై వాలంటీర్లను అడిగితే హౌస్ మ్యాపింగ్‌లో ఉండాలని, రేషన్ కార్డ్ ఉండాలని, ఒకవేళ ఇవన్నీ ఉన్నా వాళ్ళు స్థానికంగా ఉండాలని సమాధానం చెబుతున్నారని తెలిపారు. వర్షాలు, వరదలు లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇచ్చే తక్షణ సహాయానికి కూడా ఇన్ని నియమ నిబంధనలు అవసరమా? అని ప్రశ్నించారు. తల్లిదండ్రులతో వేరుపడిన కొడుకుల కుటుంబాలకు వేరుగా రేషన్ కార్డు ఉన్నా కూడా ఒకరికి మాత్రమే రూ.2వేలు ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రతి దానికీ ఏ ఒక వంక పెట్టడం దారుణమన్నారు. గోదావరి వరద ముంపునకు గురైన ఇళ్లను సర్వే చేసి తక్షణమే నష్ట పరిహారం ఇవ్వాలని, రూ.2000 తక్షణ సాయం విషయంలో ఎటువంటి కారణాలు చూపించకుండా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు ఎండి.షరీఫ్, తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్, సీనియర్ నాయకులు బండారు శివయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు ప్రకాశరావు

8న మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి -పాడేరు: ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా స్థానిక జి.ఎం.ఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో ఈనెల 8న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని ఐటిడిఎ పి.ఓ. వి.అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అపోలో ట్రైబ్ కంపెనీలో ట్రైని పోస్టులకు మెకానికల్, ఐ.టి.ఐ, ఇ ఇ ఇఇ, 2019 నుండి 2023 మధ్య కాలంలో డిప్లమా పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. నెలకు రూ.19,950 లు వేతనం చెల్లిస్తారని చెప్పారు. అభ్యర్థులు 18 నుండి 23 ఏళ్ళ వయస్సు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్, ఫార్మా అసిస్టెంట్ ఉద్యోగాలకు పదవతరగతి, ఇంటర్, డిగ్రీ, ఎం.ఫార్మసీ, బి. ఫార్మసీ, డి.ఫార్మసీ చదివిన 18 ఏళ్ళ నుండి 30 ఏళ్ళ వయస్సు కలిగిన అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 8వ తేదీన ఉదయం 10 గంటలకు పాడేరు జి.ఎం.ఆర్. పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, విద్యార్హతల సర్టిఫికేట్లు, జెరాక్స్ కాపీలు వెంట తీసుకుని రావాలని పూర్తి వివరాలకు సమన్వయ కర్త బాబును 6304634447 మొబైల్ నంబర్లో సంప్రదించాలని సూచించారు.

'స్పందన' సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి -పాడేరు : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో గిరిజనుల సమస్యలపై 65 అర్జీలను అధికారులు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ. వి.అభిషేక్, డిఆర్ఓ పి.అంబేద్కర్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు జారీ చేసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ (గిరిజన సంక్షేమం) వి.వి.ఎస్. శర్మ, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్.ఎం. రాజు, పంచాయతీ రాజ్ ఇఇ టి.కొండయ్యపడాల్, పి.ఐ.యు ఇఇ. కె.లావణ్య కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, సర్వే సహాయ సంచాలకులు వై.మోహనరావు, ఏ.పి.డి. ఎస్ పిడి. సూర్యలక్ష్మి ఎల్.డి. ఎం.రవితేజ తదితరులు పాల్గొన్నారు.జి.కె. వీధి మండలం, జి.కె. వీధి పంచాయతీ యర్రవరం గ్రామస్తులు పెలువల పూర్వయ్య, వంతల రాధిక, వంతల ప్రసాద్ తదితరులు తమ సాగులో ఉన్న అటవీ భూములకు అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. జి.కె. వీధి మండలం పూజారి పాకలు గ్రామానికి చెందిన తగ్గి బాలయ్య చెందిన భూమిని ఇతరులు అక్రమంలో ఇల్లు నిర్మించారని సర్వే చేసి తన భూమిని ఇప్పించాలని కోరారు. అరకులోయ మండలం మాదల పంచాయతీ మునిసిగుడ గ్రామానికి చెందిన రెట్టి స్వామి తన భూమిని రీ సర్వే చేయాలని దరఖాస్తు చేశారు. పెదబయలు మండలం గుల్లేలు గ్రామ పంచాయతీ బోయరాజులు గ్రామానికి చెందిన కె.చిన్నయ్య గత నెలలో కురిసిన వర్షాలకు తన ఇల్లు దెబ్బతిందని నష్ట పరిహారం మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. జి.కె. వీధి మండలం లక్కవరపు పేట పంచాయతీ కిన్నెర్ల బండ గ్రామంలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు గెమ్మెలి జగ్గారావు, సాంగి మహేష్ వినతి పత్రం సమర్పించారు. హుకుంపేట మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు ఎస్.లక్ష్మమ్మ గత వారం స్పందనలో తన ఇల్లు కాలి పోతుందని వాటర్ ప్రూఫ్ కవర్ మంజూరు చేయాలని కోరగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఆమెకు అందజేశారు.

25 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి-జి.మాడుగుల : మండలం కొక్కిరాపల్లి జంక్షన్ వద్ద గురువారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. స్విఫ్ట్ కారుని తనిఖీ చేయగా 25 కేజీల గంజాయి పట్టుబడింది. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని స్థానిక సీఐ సత్యనారాయణ తెలిపారు. పట్టుబడిన వారిలో మాకవరపాలెం పంచాయతీ వజ్రగడ గ్రామానికి చెందిన గంధం వెంకట నాగేంద్ర వర్మ, మరో ఇద్దరు వ్యక్తులు తమిళనాడుకు చెందిన వారీగా గుర్తించారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్టు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

గీతం అధ్యక్షునితో ఆస్ట్రేలియా ట్రేడ్ కమిషనర్ భేటీ



శ్రీభరత్‌ను కలుసుకున్న నషీద్ చౌదరి

ప్రజాశక్తి- మధురవాడ : గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్‌ను భారతీయ ప్రాంత పశ్చిమ ఆస్ట్రేలియా ట్రేడ్ కమిషనర్ నషీద్ చౌదరి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సమావేశం అయ్యారు. ఆస్ట్రేలియాలోని విద్యారంగం స్థితిగతులతో పాటు భారత ఆస్ట్రేలియా దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను వివరించారు. గీతం విశ్వవిద్యాలయానికి ఆస్ట్రేలియాలోని విశ్వవిద్యాలయాలకు మధ్య మెరుగైన సంబంధాలు నెలకొల్పడానికి కృషి చేస్తానని తెలిపారు. గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నత విద్యను అందించడానికి ప్రణాళికాయుతంగా కృషిచేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో గీతం కెరీర్ గైడెన్స్ అధికారి కమాండర్ గురుమూర్తి గంగాధరన్, డైరెక్టర్ డాక్టర్ వంశీ, అదర్ కెరీర్ ఆప్షన్స్ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్, సి.ఎ.శ్రీరామ్ పాల్గొన్నారు.

గీతం వర్సిటీలో వరల్డ్ ఎడ్యుకేషన్ ఫెయిర్

ప్రజాశక్తి- మధురవాడ : ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ప్రపంచంలోని వివిధ దేశాలలో గల ప్రముఖ విశ్వవిద్యాలయాలలో అందించే కోర్సులు, ప్రవేశ పొందే వివరాలను తెలియజేసేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా శుక్రవారం వరల్డ్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహించారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్, గ్లోబల్ రీచ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను భారత-గల్ఫ్ ప్రాంత పశ్చిమ ఆస్ట్రేలియా ట్రేడ్ కమిషనర్ నషీద్ చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో విద్యాభ్యాసంతో పాటు నిపుణులకు విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. వివిధ కోర్సులు పూర్తి చేసిన వారికి ఆస్ట్రేలియా ప్రభుత్వం నైపుణ్య శిక్షణ కేంద్రాలను నెలకొల్పి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. విద్యార్థులు నూతన ఆవకాశాల కోసం ఆస్ట్రేలియా రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ మాట్లాడుతూ గీతంలో వివిధ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ప్రాంగణ నియామకాలతో పాటు విదేశీ విద్య అవకాశాలు, గేట్, సివిల్ సర్వీస్ నియామకపు విధానాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్లోబల్ రీచ్ సంస్థ ప్రతినిధి మేఘ అరోరా మాట్లాడుతూ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో అమెరికా, యుకె, సింగపూర్, స్విడ్జర్‌ల్యాండ్, ఆస్ట్రేలియ, కెనడా, న్యూజలాండ్‌లకు చెందిన 28 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో గీతం కెరీర్ గైడెన్స్ అదర్ కెరీర్ ఆప్షన్స్ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్, సి.ఎ.శ్రీరామ్, వివిధ విభాగ అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వరల్డ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభిస్తున్న ఆస్ట్రేలియా ట్రేడ్ కమిషనర్ నషీద్‌చౌదరి

10 నుంచి పవన్‌కల్యాణ్ వారాహి యాత్ర

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఈనెల 10 నుండి 19 వరకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి యాత్ర నిర్వహించనున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది జనవాణి పేరుతో నగరంలో కార్యక్రమానికి పిలుపునిస్తే, వేలాది ఫిర్యాదులు వస్తాయని, పోలీసులతో అడ్డుకొని, వైసీపీ నేతలు తమ నాయకుడిని ఇక్కడి నుంచి పంపించేశారన్నారు. వారాహి యాత్రలో పవన్ కల్యాణ్‌కు నేరుగా వినతులు ఇచ్చేలా ఏర్పాటు చేస్తామని, నగర ప్రజల వినియోగించుకుని విజయవంతం చేయాలన్నారు. చోడవరం జనసేన ఇన్‌ఛార్జి పిఎస్ఎన్ రాజు వీర మహిళ రూప దేవి పాల్గొన్నారు.

శెట్టి బలిజలంతా ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి-సీతమ్మధార: శెట్టి బలిజ కులస్తులందరూ ఐక్యంగా ఉండాలని సింహాచలం దేవస్థానం ట్రస్ట్ సభ్యులు, వైసిపి నాయకులు సంపంగి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పౌరగ్రంథాలయంలో శెట్టిబలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం జరిగింది. కరోనా సమయంలో ప్రజలకు విశిష్ట సేవలు అందించి, ప్రాణాలు కాపాడిన వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ సంఘం సీనియర్ నాయకులు కట్ల మల్లేశ్వరరావు మాట్లాడుతూ శెట్టిబలిజ కులస్తులు నాలుగు లక్షల ఓటర్లు ఉన్నా, ఎటువంటి రాజకీయ ప్రాధాన్యం దక్కపోవడం అన్యాయమన్నారు 2024 ఎన్నికల్లో శెట్టిబలిజ కులస్తులకు ప్రాధాన్యతనిచ్చిన పార్టీలకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కదిరి సత్య వరప్రసాద్ నరసింహారెడ్డి రాంప్రసాద్ లక్ష్మీనరసింగరావు చెల్లబోయిన మంగ వెంకట్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సీతమ్మధార: జివిఎంసి 33వ వార్డు, బంగారమ్మ మెట్ట కాలనీలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఎల్లపు లీల అనే మహిళ వైద్యానికి దక్షిణ నియోజకవర్గ వైసిపి నేత సీతంరాజు సుధాకర్ రూ.ఐదు వేలు ఆర్థికసాయాన్ని ఆ వార్డు అధ్యక్షుడు రంది మధుసూదన్ ద్వారా అందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఆడారి వెంకట మహేష్, భీశెట్టి బ్లీ రాజు, మైనారిటీ ప్రెసిడెంట్ మదీనాఖాన్, చంద్రశేఖ, సంతోష్ పాల్గొన్నారు.

త్యాగానికి ఆర్థిక ఇబ్బందులు నజరానా!

పోర్టు నిర్వాసిత కార్మికుల దీక్షా శిబిరంలో తాతారావు

ప్రజాశక్తి -గాజువాక: ఆదానీ గంగవరం పోర్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం నిర్వాసిత కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నారని, వారి త్యాగానికి పోర్టు యాజమాన్యం ఇచ్చిన నజరానా ఇదేనా అని గంగవరం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నోలి తాతారావు ఆవేదన వ్యక్తం చేశారు. తమసమస్యల పరిష్కారానికి 32రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్న నిర్వాసిత కార్మికుల దీక్షా శిబిరంలో శుక్రవారం 64వ వార్డు జనసేన గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ నిర్వాసిత కార్మికులు వేతనాల కోసం పోరాడుతుంటే, చర్చలపేరుతో యాజమాన్యం మొండివైఖరి ప్రదర్శిస్తోందన్నారు.

ఇప్పటికైనా నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్ల అమ్మోరు, మాధ అప్పారావు, కదిరి సత్యానందం, గంటిపిల్లి లక్ష్మయ్య, నొల్లి స్వామి, పేర్ల నూకరాజు పాల్గొన్నారు..

రోటరీ గవర్నర్ పర్యటన



పుస్తకాలు పంపిణీ చేస్తున్న,డిస్ట్రిక్ట్ గవర్నర్

ప్రజాశక్తి -గాజువాక : ఆటోనగర్ రోటరీ క్లబ్‌ను విశాఖపట్నం సౌత్ క్లబ్ రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్తా) శుక్రవారం పర్యటించారు. ఇచ్ఛాపురం నుండి విజయవాడ వరకుఉన్న రోటరీ క్లబ్‌లన్నింటినీ ఏడాదిలో ఒకసారి సందర్శనలో భాగంగా క్లబ్ చేస్తున్న పనులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చట్టివానిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. క్లబ్ చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను గవర్నర్ ప్రశంసించారు. ప్రెసిడెంట్. ఉమా మహేశ్వరరెడ్డి క్లబ్ చేస్తున్న, చేయబోయే కమ్యూనిటీ, మెటర్నిటీ, చైల్డ్ హెల్త్ కేర్, రోటరీ ఫ్యామిలీ కార్యక్రమాలను వివరించారు. అసిస్టెంట్ గవర్నర్ బ్రహ్మానందం, సెక్రెటరీ వెంకటగిరి, క్లబ్ మెంబర్లు యార్లగడ్డ వెంకన్నచౌదరి, రమేష్, కిషోర్‌కుమార్, చీకటి సత్యానారాయణ పాల్గొన్నారు.

సిపిఐ బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -ములగాడ :కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 17న కూర్మన్నపాలెంలో ప్రారంభంకానున్న సిపిఐ రాష్ట్రవ్యాప్త బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ పశ్చిమ నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం బి హరినాథ్ అధ్యక్షతన మల్కాపురంలో జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని, కార్పొరేట్లకు అప్పగిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు, ఉద్యమాలు, పోరాటాలు, ప్రాణాలు త్యాగం చేసి సంపాదించుకున్న విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేయొద్దని, గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి సత్యాంజనేయ, సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, నేతలు సత్యానందరావు, గండి అప్పారావు, ఎన్‌వి త్రినాథ్, పోతిన రాము మాధవరావు, కోరమండల్ కాంటాక్ట్ లేబర్ యూనియన్ సత్తిబాబు, కోలాడ శంకరరావు, మహిళా సంఘం నాయకులు గుడాల జయ, గండి రవణమ్మ, లక్ష్మి, పందిరి జయ, డిహెచ్‌పిఎస్ నేతలు కామేశ్వరరావు వెంకట్ పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల జిల్లా మహాసభ

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పదవ మహాసభలు శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షులు బివి రామాంజనేయరావు తెలిపారు. దామోదర్ సంజీవయ్య లావర్సిటీ విసి ప్రొఫెసర్ పి.శ్రీసుధ ముఖ్యఅతిథిగా పాల్గొని మహాసభలను ప్రారంభిస్తారని, విశిష్ట అతిథిగా జిల్లా విశ్రాంత న్యాయమూర్తి యు.సత్యాఆరవు పాల్గొని 'భారతీయ వారసత్వ చట్టం ప్రస్తుత పరిస్థితులు" అంశంపై ప్రసంగిస్తారన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విశాఖపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. మహాసభల చివరలో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నిక జరగనుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఆనందరెడ్డి తెలిపారు.



ఎర్రి గెడ్డను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ

జ్ఞానాపురం ఎర్రి గెడ్డ సమస్య పట్టదా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వర్షాకాలంలో జ్ఞానాపురం ప్రాంతాన్ని నీటి ముంపునకు గురి చేస్తున్న ఎర్రి గెడ్డ సమస్యను వైసిపి ప్రభుత్వం పరిష్కరించలేకపోయిందని టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ విమర్శించారు. సెల్ఫీ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జ్ఞానాపురం ప్రాంతంలోని 41వ వార్డులో ఆయన పర్యటించి, ఆ ప్రాంత సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా దక్షిణ నియోజకవర్గంలో ఉన్న సమస్యలు పరిష్కారంకాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలోని సెయింట్ పీటర్ పాఠశాలను జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మూసేశారని తెలిపారు. దీంతో ఎంతో మంది విద్యార్థులు, అధ్యాపకులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు ఎన్ని అవస్థలు పడుతున్నా కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షుడు ఐతి మధుబాబు, పాత్రపల్లి రాజకుమార్, ఆకుల ఆనందరావు, మహిళా అధ్యక్షురాలు అనిత, రవిబాబు, నొడగల ఆనందరావు, సన్నీ, యాదవ్, జ్యోత్స్న, కోమలి పాల్గొన్నారు.

6న మూడు గ్రంథాలపై సమాలోచన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల సందర్భంగా ఎన్‌టిఆర్ లిటరేచర్ సావనీర్, వెబ్‌సైట్ కమిటీ రూపొందించిన మూడు గ్రంథాలపై సమాలోచన కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దసపల్లా హోటల్‌లోని వేదిక హాల్‌లో ఉంటుందని టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని పుస్తకాల్లో పొందుపరిచిన అంశాలపైనా, ఎన్‌టి.రామారావు పరిపాలనలో జరిగిన చారిత్రక సంఘటనలు, అభివృద్ధి, సంక్షేమంపైనా వారి అభిప్రాయాలను వెల్లడిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ తనయుడు రామకృష్ణ, ఎన్‌టిఆర్ లిటరేచర్, సావనీర్, వెబ్‌సైట్ కమిటీ చైర్మన్ టిడి.జనార్ధన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌ది హత్యే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :అనుమానాస్పదంగా మృతిచెందిన విశాఖ వన్‌టౌన్ కానిస్టేబుల్ రమేష్ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసు వివరాలను విశాఖ నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ మీడియాకు శుక్రవారం వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ రైటర్‌గా రమేష్ (35) పనిచేస్తున్నాడు. బుధవారం తన ఇంట్లోనే అనుమానాస్పదంగా మృతిచెందాడు. అతని భార్య శివాని ప్రవర్తనపై అనుమానం రావడంతో పోలీసులు లోతుగా విచారించారు. రమేష్ ఇంటి సమీపంలో ఉన్న కారు డ్రైవర్ రామారావు, శివానిల మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్టు గుర్తించారు. వారిద్దరి మధ్య సాన్నిహిత్యాన్ని రమేష్ ప్రశ్నించాడు. దీంతో ప్రియుడు రామారావు, శివాని కలిసి రమేష్ హత్యకు పథకం వేశారు. నీలా అనే వ్యక్తికి రూ.లక్ష సుపారీ కూడా చెల్లించినట్టు తెలిసింది. వారంతా కలిసి మద్యం తాగి పడుకున్న రమేష్ ముఖంపై దిండుతో అదిమి చంపేశారు. ఈ కేసులో ఎ1గా శివానిని, ఎ2గా రామారావును, ఎ3గా నీలాను చేర్చి, అరెస్టు చేసి విచారిస్తున్నట్టు పోలీస్ కమిషనర్ తెలిపారు.

ఓర్వలేక దాడులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి జగన్ మోహన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జి అన్నారు. పుంగనూరులో టిడిపి శ్రేణులపై దాడిని ఖండిస్తూ శుక్రవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై గండి బాబ్జీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.

పెన్షనర్ల ఆరోగ్య హక్కుపై దాడి

సిజిహెచ్‌ఎస్ షెడ్లపై జివిఎంసి ప్రతాపం

కూల్చివేతతో చికిత్స అందక దిక్కుతోచని వేల మంది వృద్ధులు - చోద్యం చూస్తున్న కేంద్రం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వారంతా విశ్రాంత ఉద్యోగులు, పోరాడటానికి సత్తువ లేనివారని భావించేమో మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) అధికారులు ప్రతాపం చూపారు. గత నెల 25న నగరంలోని చినవాల్తేరు ఆసుపత్రి ప్రాంగణంలోగల సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం (సిజిహెచ్‌ఎస్) పెన్షనర్ల ఆసుపత్రి షెడ్లను 12 అడుగుల వరకూ కూల్చేశారు. దీంతో నేడు వైద్యం అందక పెన్షనర్లంతా అగమ్యగోచర స్థితిలో పడ్డారు. జివిఎంసి నెల రోజుల క్రితమే తమ రహదారి విస్తరణ కోసం సిజిహెచ్‌ఎస్ షెడ్లను తీసేయాల్సి వస్తుందని నోటీసు ఇచ్చినా.. ఆ సమాచారం హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలోని అడిషనల్ డైరెక్టర్‌కు మెంటల్ కేర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలియజేసినా.. పై నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. కేంద్రంలోని బిజెపి సర్కారుకు కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లపై ఎంత శ్రద్ధ ఉందో ఈ విషయంలో ఇట్టే అర్థమవుతుంది. ముఖ్యంగా ఎపి విభజన హామీల్లో భాగంగా విశాఖ కేంద్రంగా సిజిహెచ్‌ఎస్‌కు అడిషనల్ డైరెక్టర్ పోస్టును కేటాయించాల్సి ఉన్నా బిజెపి సర్కారు ఆ పనిచేయలేదు. పెన్షనర్లంతా ఈ విషయంపై నెలల తరబడి గగ్గోలు పెడుతున్నారు. హైదరాబాద్ నుంచే ఒక డైరెక్టర్ 16 వెల్‌నెస్ సెంటర్లను చూస్తున్నారు. ఎపి వ్యవహారాలనూ అక్కడి నుంచే చూడాలి. కానీ కన్నెత్తి కూడా ఆ అధికారి చూడడం లేదు. ఆంధ్రప్రదేశ్‌కు.. ముఖ్యంగా విశాఖకు కేంద్రంలోని మోడీ సర్కారు చేసిన ద్రోహాల్లో ఇది కూడా ఒకటి. కేంద్ర ప్రభుత్వ రంగ ఉద్యోగుల బాధలు తీర్చడానికే విశాఖపట్నానికి వచ్చానంటూ నిత్యం ప్రచారార్భాటం చేసే బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు సైతం పెన్షనర్ల సిజిహెచ్‌ఎస్‌కు అధికారిని కేటాయించి, సరైన స్థలంలో ఏర్పాటు చేయడానికి ఎలాంటి కృషీ చేయలేదు.



జివిఎంసి అధికారులు కూల్చిన సిజిహెచ్‌ఎస్ షెడ్లు

విశాఖలోనే 30 వేల హెల్త్ కార్డులు

ఇచ్ఛాపురం నుంచి రాజమండ్రి వరకూ విశాఖపట్నం కేంద్రంగా నడిచిన సిజిహెచ్‌ఎస్ ఆసుపత్రిలో 30 వేల కార్డులు పెన్సనర్లవి ఉన్నాయి. వీటిలో 90 శాతం విశాఖకు చెందిన సెంట్రల్ గవర్నమెంట్ రిటైర్డ్ ఉద్యోగులవే. చినవాల్తేరు వద్దనున్న షెడ్లలో సిజిహెచ్‌ఎస్ నడిచేది. జివిఎంసి అధికారుల పుణ్యమా అంటూ...వారి రోడ్డు విస్తరణ కోసం 12 అడుగుల స్థలంలోని ఈ ఆసుపత్రి షెడ్లను పడగొట్టేశారు. ఇదిలా ఉండగా సిజిహెచ్‌ఎస్ మరో వెల్‌నెస్ సెంటర్ డాబాగార్డెన్స్‌లో ఉంది. 30 వేల కార్డులకు మూడు వెల్‌నెస్ సెంటర్లు విశాఖలో ఉండాలన్న పెన్షనర్ల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు సరికదా ఉన్నటువంటి ముఖ్యమైన ఆసుపత్రి ప్రాంగణాన్ని కూడా పడగొట్టేవరకూ వేచిచూడడంతో వృద్ధులు నేడు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. డాబాగార్డెన్స్ వెల్‌నెస్ సెంటర్‌లో చికిత్స కోసం వెళితే అధిక సంఖ్యలో రోగులు ఉండడంతో అష్టకష్టాలు పడాల్సి వస్తోందని, మందుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అప్పలస్వామి అనే పెన్షనర్ తీవ్ర బాధను వ్యక్తం చేశారు. ఆలిండియా రేడియో కేంద్రం విశాఖలో ఖాళీగా ఉందని, అక్కడ నడుపుకోవచ్చని స్టేషన్ డైరెక్టర్ తమను ఆహ్వానించినా కేంద్రం నుంచి క్లియరెన్స్ రాలేదంటూ పెన్షనర్లు తాజాగా మొరపెట్టుకుంటున్నారు.

మాకేమీ వైద్యం భిక్ష కాదు..నెలకి వెయ్యి చెల్లిస్తున్నాం



వైద్యాన్ని కేంద్ర ప్రభుత్వం మాకేమీ ఉచితంగా అందించడం లేదు. నెలకు 30 వేల కార్డుల ద్వారా రూ.లక్షలు కడుతున్నాం. పెన్షనర్ ఒక్కొక్కరూ నెలకు రూ.వెయ్యి చెల్లిస్తున్నారు. ఇచ్ఛాపురం నుంచి వైజాగ్ వరకూ సిజిహెచ్‌ఎస్ ఎక్కడా లేదు. తుని, రాజమండ్రి నుంచీ వస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్లు పెంచాల్సింది పోయి దీన్ని కూలగొట్టే వరకూ కేంద్రం చోద్యం చూడడం సరైంది కాదు.

జిఎస్ఎన్ మూర్తి,
సిజిహెచ్‌ఎస్ ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు

'రాజుగారి కోడి పులావ్' చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సస్పెన్స్, సందేశం మేళవింపుతో రాజుగారి కోడి పులావ్ చిత్రం నిర్మితమైందని ప్రేక్షక దేవుళ్ళు ఆదరించి తమను ప్రోత్సహించాలని సినిమా దర్శక, నిర్మాతలు శివ కోన, అనిల్ మోదుగ కోరారు. రాజు గారి కోడి పులావ్ చిత్రం శుక్రవారం విడుదల సందర్భంగా ద్వారకా నగర్‌లోని ఓ హోటల్‌లో చిత్ర బృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. చిత్ర సహ నిర్మాత, దర్శకుడు శివ కోన మాట్లాడుతూ రాజు గారి కోడి పులావ్ చిత్రం పూర్తిగా కుటుంబ కథా చిత్రమన్నారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా కొనసాగుతూ సామాజిక సందేశం అందేలా రూపొందించామన్నారు. సినిమా మొత్తం కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని మంచి పర్యాటక ప్రాంతాలైన అడవుల్లో నిర్మించామన్నారు. ఇది ఒక రోడ్ అడ్వెంచర్ మూవీనని తెలిపారు. చిత్ర కథానాయిక నిహాదేశ్ పాండే మాట్లాడుతూ రాజు గారి కోడి పులావ్ తినడానికే కాదు చూడటానికి కూడా చాలా టేస్టీగా వుంటుందన్నారు. ఈ సినిమాలో తాను నటించడం వల్ల గొప్ప అనుభూతి చెందానన్నారు. ఈ సినిమాలో కథా నాయకుడుగా అభిలాష్ నటించగా, అనిల్ మోదుగ, శివ కోన నిర్మాతలుగానూ, ప్రవీణ్ మణి సంగీత దర్శకుడిగానూ పనిచేశారు.



మాట్లాడుతున్న డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

6 నుంచి అమృత్ భారత్ స్టేషన్ల ఆధునికీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా గుర్తించిన రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులకు ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 6న వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని వాల్తేర్ డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా వాల్తేర్ డివిజన్‌లోని 15 స్టేషన్లను గుర్తించారని తెలిపారు. మొదటి విడతగా దువ్వాడ రైల్వే స్టేషన్‌ను రూ.26.31 కోట్లతో, విజయనగరం స్టేషన్‌ను రూ.35.76 కోట్లతో, దమన్‌జోడి స్టేషన్‌ను రూ.13.93 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని 10, ఒడిశాలోని 4, ఛత్తీస్‌గఢ్‌లోని ఒక స్టేషన్‌ను ఆధునికీకరిస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలూ అత్యంత మెరుగ్గా ఆయా స్టేషన్లలో ఉంటాయన్నారు. ఇప్పటికే మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేశామన్నారు.

సచివాలయాల్లో ఖాళీలు

భర్తీచేయని ప్రభుత్వం - ఉద్యోగులపై పెరుగుతున్న పనిభారం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీలు పెరుగుతున్నాయి. దీంతో ప్రస్తుత ఉద్యోగులపై పనిభారం పెరుగుతోంది. 2020 తరువాత వివిధ శాఖల్లోని పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆ ఖాళీలు సంఖ్య 800కు చేరింది. నియామకాలు జరిగిన తరువాత కొంతమంది ఉద్యోగులు రాజీనామా చేసి ఇతర ఉద్యోగాల్లో చేరారు. కొద్దిమంది ఒత్తిళ్లు, ఇతర కారణాలతో మానేశారు. ఈ నేపథ్యంలో ఉన్నవారిపై పనిభారం పడుతోంది.

జిల్లాలోని గ్రామ సచివాలయాలు 465, వార్డు సచివాలయాలు 57 వెరసి 522 వున్నాయి. వీటిలో దాదాపు నాలుగు వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2020 తరువాత సచివాలయ ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో ఖాళీలు అలాగే ఉన్నాయి. అత్యధికంగా విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు 217, హార్టికల్చర్ అసిస్టెంట్ పోస్టులు 139 వున్నాయి. ఈ రెండింటికీ విద్యార్హతులు కలిగిన అభ్యర్థులు లేకపోవడంతో గతంలో భర్తీ కాలేదు. దీంతో ఈ పోస్టుల ఖాళీలు ఎక్కువగా వున్నాయి. సచివాలయాల్లో ఆయా శాఖల ఖాళీలు భర్తీచేయకపోవడంతో ఇతర ఉద్యోగులకు ఆ పనులు అప్పగిస్తున్నారు.

ఇవీ ఖాళీలు

పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ - 6 (డిజిటల్ అసిస్టెంట్స్) 54, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్ 68, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ 25, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్స్ 139, ఫిషరీస్ అసిస్టెంట్స్ 3, వెటర్నరీ అసిస్టెంట్స్ 217, గ్రేడ్-2 ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ 73, విలేజ్, వార్డు రెవెన్యూ అధికారులు 66, గ్రేడ్-3 విలేజ్ సర్వేయర్ అసిస్టెంట్స్ 31, సెరీకల్చర్ అసిస్టెంట్స్ 2, గ్రేడ్-2 వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు 2, గ్రేడ్ -2 వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శులు 7, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు 3, గ్రేడ్-2 వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్యదర్శి ఒకరు, వార్డు సదుపాయాల కల్పన కార్యదర్శులు రెండు, వార్డు పరిపాలన కార్యదర్శి ఒకటి, మహిళా పోలీసు, బలహీనవర్గాల సంరక్షణ కార్యదర్శులు 68, వార్డు ఎనర్జి అసిస్టెంట్స్, కార్యదర్శులు 35, ఎఎన్‌ఎమ్/వార్డు హెల్త్ కార్యదర్శులు మూడు పోస్టులు ఖాళీగా వున్నాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియాపై నగర ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ శుక్రవారం నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలో విరివిగా వర్షాలు పడుతున్న దృష్ట్యా దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.